epaper.eenadu.net

# మెట్రో స్వాధీనానికి అసెంబ్లీ ఆమోదం

- స్వయంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం
- విస్తరణపై కేంద్ర ఆమోదానికి గట్టిగా కృషి చేస్తామని వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఎల్‌అండ్‌టీ సంస్థ నుంచి హైదరాబాద్ మెట్రో రైలును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం తీర్మానం ప్రవేశపెట్టారు. మెట్రో రెండో దశను చేపట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో ఫేజ్‌1ను స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. “విశాల ప్రజాప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించాలనే వివిధ వర్గాల డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం ఉన్న మెట్రో ఫేజ్1 69 కిలోమీటర్ల మేర నిర్మాణం జరిగింది. ఫేజ్2ఏ 76.4 కిలోమీటర్లు, ఫేజ్2బీ 86.1 కిలోమీటర్ల మేర విస్తరణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాం. ఫేజ్2 ఏ, బీలను ప్రభుత్వ ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఎదురవుతున్న అడ్డంకులను, సమస్యలను లోతుగా సమీక్షించాం. కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన అంశాలను పరిష్కరించేందుకు ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో ఫేజ్1 నెట్‌వర్క్‌ను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించాం. దీనిని సభ ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరుతున్నాం’’ అని పేర్కొన్నారు. ఫేజ్2 విస్తరణకు త్వరగా కేంద్ర ఆమోదం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదించినందుకు ముఖ్యమంత్రి సభకు ధన్యవాదాలు తెలిపే క్రమంలో భారాస సభ్యులు వ్యతిరేకించారు. ఇది ఏకగ్రీవ ఆమోదం కాదని, ఏకపక్ష నిర్ణయమని హరీశ్‌రావు అన్నారు.

## మెట్రో పూర్వాపరాలను వివరించిన శ్రీధర్‌బాబు



మెట్రో రైల్ నెట్‌వర్క్‌పై మంత్రి శ్రీధర్‌బాబు అంతకుముందు ముఖ్యమంత్రి తరఫున ప్రకటన చేశారు. “హైదరాబాద్‌లో పెరిగిన వాహనాల రద్దీ, కాలుష్యం కట్టడికి మెట్రో నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటి దశలో మియాపూర్- ఎల్బీనగర్ 29 కి.మీ., జేబీఎస్- ఎంజీబీఎస్ వరకు 11 కి.మీ., నాగోల్- రాయదుర్గం 29 కి.మీ. మెట్రో నిర్మాణం జరిగింది. రెండో దశలో 5 కారిడార్లుగా మెట్రోను నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇందులో నాగోల్- శంషాబాద్ విమానాశ్రయం, రాయదుర్గం- కోకాపేట, ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట, మియాపూర్- పటాన్‌చెరు, ఎల్బీనగర్- హయత్‌నగర్ కారిడార్ల నిర్మాణానికి రూ. 24,269 కోట్లతో ప్రతిపాదనలు చేశాం. ఫేజ్2 బీలో మూడు కారిడార్లను నిర్మించాలనుకున్నాం. ఇందులో ఎయిర్‌పోర్ట్- భారత్ సిటీ, జేబీఎస్- మేడ్చల్, జేబీఎస్- శామీర్‌పేట మధ్య రూ.19,579 కోట్లతో మెట్రో నిర్మాణ ప్రతిపాదలను 2024 నవంబరు 4న కేంద్రానికి సమర్పించాం. 2025లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఆమోదం లభించింది’’ అని శ్రీధర్‌బాబు వెల్లడించారు.